ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలి



ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

నిజాంపేట్: ప్రభుత్వ స్థలాలు కబ్జా గురుకాకుండా చూడాలని నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ మాజీ అధ్యక్షుడు ఆకుల సతీశ్ కోరారు. సోమవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో ఈ విషయమై ఫిర్యాదు చేశారు. ఇప్పటికే కుంటలు, చెరువులు కబ్జా చెరలో చిక్కుకున్నాయని, గాజులరామారం సర్కిల్ పరిధిలో పది చెరువులు కబ్జాతో కనుమరుగయ్యే స్థితిలో ఉన్నాయని వివరించారు. బాధ్యులపై చర్యలు తీసుకుని చెరువులను పరిరక్షించాలని కోరారు. ఆయన వెంట నాయకులు గొల్ల కృష్ణ, అరుణ్ రావు, ముఖేష్, కుమార్‌గౌడ్, ప్రవీణ్, లింగారెడ్డి ఉన్నారు.

'నిరుద్యోగుల గొంతు నొక్కుతున్న ప్రభుత్వం'

కుత్బుల్లాపూర్: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల గొంతును నొక్కుతుందని భారతీయ విద్యార్థి పరిషత్ మేడ్చల్ జిల్లా కన్వీనర్ రేగోడ్ నగేశ్ అన్నారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో చేపట్టిన 'చలో సెక్రటేరియేట్ ముట్టడి' కార్యక్రమంలో భాగంగా నగేశ్‌ను చంద్రగిరినగర్‌లోని తన నివాసంలో సోమవారం తెల్లవారుజామున పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌కు తరలించి సాయంత్రం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా నగేశ్ మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ పాలనలో నిరసనలు తెలిపే స్వేచ్ఛను హరిస్తూ నిర్బంధాలు, అరెస్టులు చేశారో ఈ ప్రభుత్వం కూడా అదేబాటలో సాగుతుందన్నారు. విద్యార్థులు, నిరుద్యోగులపై వ్యవహరిస్తున్న తీరును మార్చుకోవాలి లేకుంటే కేసీఆర్‌కు పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి



కొంపల్లిలో ర్యాలీ తీస్తున్న అంగన్ వాడీ సిబ్బంది

దుండిగల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను చేర్పించాలని కోరుతూ సోమవారం పలు ప్రాంతాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. 'అమ్మ మాట–అంగన్‌వాడి బడిబాట' కార్యక్రమాన్ని చేపట్టారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందిస్తున్నామని, దీంతో చిన్నారుల చేరిక సంఖ్య క్రమంగా పెరుగుతోందని అధికారులు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో కౌన్సిలర్లు సాయిబాబా, భరత్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్లు ఎం.మీనా దేవి, పద్మావతి, విజయనిర్మల, వీవో సుకన్య పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న కౌన్సిలర్లు

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ డీపోచంపల్లిలోని ఆరో వార్డులో సీసీ రోడ్డు పనులను కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, రమాదేవి మంగళవారం ప్రారంభించారు. అనంతరం పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మహేందర్ యాదవ్, సాయి యాదవ్, మాజీ సర్పంచ్ తలారి యాదగిరి, కొల్తూర్ మల్లేష్ ముదిరాజ్, నేతలు వెంకటేశ్ యాదవ్, నాయకులు వేణు గౌడ్, కొక్కండ శ్రీధర్, రాజు, గణేశ్, మహేశ్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బెల్టు రివార్డుల అందజేత



విద్యార్థులకు బెల్ట్ రివార్డులు అందజేస్తున్న సినీహీరో సుమన్

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ మహాదేవపురంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన టైకా మార్షల్ ఆర్ట్స్ అకాడమీని సినీ హీరో సుమన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు అకాడమీ చైర్మన్ అశోక్ చక్రవర్తితో కలిసి బెల్ట్ రివార్డులు అందజేశారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ కరాటేతో పిల్లలకు క్రమశిక్షణతో పాటు ఆరోగ్యం, ఆత్మరక్షణ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రాండ్ మాస్టర్లు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఆల్విన్‌కాలనీ: అంగన్‌వాడీ హెల్పర్లు, టీచర్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు సోమవారం శేరిలింగంపల్లి పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీఓ 10ని రద్దు చేయాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ పెంచుతూ వీఆర్‌ఎస్ సౌకర్యం కల్పిస్తూ కొత్త జీవో ఇవ్వాలని, హెల్పర్లకు పాత పద్ధతిలోనే ప్రమోషన్ ఇవ్వాలన్నారు. 24 రోజుల సమ్మె సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లకు, హెల్పర్లకు గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు, కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమ్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సంజీవరెడ్డి, బాలింగ్ గౌతమ్ గౌడ్, జిల్లా గణేష్, కంది జ్ఞానేశ్వర్, రఘునాథ్, సీపీఎం నాయకులు శోభన్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

నిజాంపేట్: హెచ్‌ఎండీఏ రోడ్డు వెడల్పు పనులు నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని బాచుపల్లి సెక్షన్ ఏఈ శాంతకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.11 కేవీ శ్రీహోమ్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు శ్రీహోమ్స్ కాలనీ, ఆర్టీసీ కాలనీ, క్రాంతినగర్, బొల్లారం ఇండస్ట్రీ ఏరియా, మమత ఆస్పత్రి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

ఎన్నాళ్లీ అవస్థలు..?

- చిన్నపాటి వర్షానికే వరద నిల్వ
- నత్తనడకన డ్రెయిన్‌లు, క్యాచ్‌మెంట్ ప్లాయింట్ల నిర్మాణాలు
- ఇబ్బందుల్లో వాహనదారులు, ప్రజలు
- త్వరగా పూర్తి చేయాలని విన్నపం



ఆదర్శనగర్ ఎన్టీఆర్ విగ్రహం వద్ద పూర్తయినా వాటర్ డ్రెయిన్ నిర్మాణ పనులు..

రంగారెడ్డినగర్: ప్రధాన రోడ్ల వెంట వర్షపు నీరు నిల్వ లేకుండా చేపడుతున్న డ్రెయిన్‌లు, క్యాచ్‌మెంట్ పాయింట్ల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. కొన్నిచోట్ల పనులు పూర్తికాగా, మరో కొన్ని ప్రాంతాల్లో ఇంకా ప్రారంభ దశలోనే ఉండడం గమనార్హం. వివరాల్లోకి వెళ్తే.. అల్వాల్, జీడిమెట్ల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్లు, దుండిగల్, కొంపల్లి మున్సిపల్ ప్రాంతాలను ఆనుకుని 12 చోట్ల వరద నిలుస్తుందని గుర్తించి తగు చర్యలు చేపట్టాలని కోరుతూ ఆయా స్టేషన్ల ట్రాఫిక్ సీఐలు కొన్ని నెలల క్రితం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌కు నివేదిక అందజేశారు. దీనిపై స్పందించిన ఆయన సంబంధిత సర్కిళ్ల, ట్రాఫిక్ అధికారులు సమన్వయంతో పనిచేసి ఆయా ప్రాంతాల్లో వరద క్యాచ్‌మెంట్, డ్రెయిన్‌ల నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. ఈ పనులు వేసవి ప్రారంభంలోనే చేపట్టి పూర్తి చేయాల్సి ఉండగా, వర్షాలు ప్రారంభమైనా ఇంకా కొనసాగుతుండడంతో వాహనదారులు, ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. .

డ్రెయిన్లు, క్యాచ్‌మెంట్ ప్రాంతాలు..

జీడిమెట్ల ట్రాఫిక్ పీఎస్ పరిధిలోని మహదేవపురం చౌరస్తా, బాలాజీ లేఅవుట్ ప్రధాన రోడ్డు, జీడిమెట్ల బస్ డిపో సమీపంలోని నర్సాపూర్ రాష్ట్ర రహదారి వెంబడి, చింతల్ ప్రధాన రోడ్డులోని రిడ్జ్ టవర్స్, ఆదర్శనగర్ ఎన్టీఆర్ విగ్రహం జీడిమెట్ల ట్రాఫిక్ పీఎస్ పరిధిలోని జీడిమెట్ల గ్రాంధీ విగ్రహం వద్ద, కొంపల్లి ఎస్‌ఎన్‌ఆర్ గార్డెన్ సమీపంలో, అల్వాల్ వెంకటాపూర్, జ్యోతినగర్, లయోలా కాలేజీ బస్టాప్ సమీపంలో డ్రెయిన్లు, వాటర్ క్యాచ్‌పాయింట్ల నిర్మిస్తున్నారు.

ఈ ప్రాంతాలపై నిర్లక్ష్యం..

ఐడీపీఎల్–జగద్గిరిగుట్ట రోడ్డులోని రంగారెడ్డినగర్ స్వామి వివేకానంద విగ్రహం సమీపంలో, సంజయ్‌గాంధీనగర్– నెహ్రూనగర్ రోడ్డు, గాజులరామారంలోని చిత్తారమ్మ ఆలయం సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఎదురుగా, సూరారంలోని సాయిపూజా థియేటర్ల సమీపంలో వర్షాకాలంలో పెద్ద మొత్తంలో వరద నిలుస్తున్నది. అయితే కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌కు అధికారులు అందజేసిన నివేదికలో ఈ ప్రాంతాలు లేకపోవడం గమనార్హం.



చింతల్ ప్రధాన రోడ్డులోని రిడ్జ్ టవర్స్ ఎదురుగా అసంపూర్తిగా పనులు..



కొరవడిన ముందస్తు ప్రణాళిక..

కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో ఆలస్యంగా డ్రెయిన్ల పనులు ప్రారంభించారు. జీడిమెట్ల ట్రాఫిక్ పీఎస్ పరిధిలోకి వచ్చే ఆదర్శనగర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం సమీపంలో మాత్రమే పనులు పూర్తికాగా మిగతా ప్రాంతాల్లో ప్రారంభ దశలో, మధ్యలోనే పనులు ఉండడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. జీడిమెట్ల బస్ డిపో సమీపంలో పనులు మరో నెల రోజులు పట్టనున్నాయి. అదేవిధంగా చింతల్ ప్రధాన రోడ్డులోని గణేశ్‌నగర్ వద్ద డ్రెయిన్ లైన్, క్యాచ్‌పిట్ పాయింట్లను పూర్తి చేయగా రిడ్జ్ టవర్ పైపులు వేసినా మూతలు ఏర్పాటు చేయలేదు. బాలాజీ లేవుట్ చౌరస్తా, మహాదేవాపురం ప్రాంతాల్లో పనుల ఉనికే లేదు. అల్వాల్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో జీడిమెట్ల గ్రామం గాంధీ విగ్రహం, కొంపల్లిలోని ఏఎంఆర్ గార్డెన్స్ సమీపంలో పనులు పూర్తి కావాల్సి ఉంది.



జీడిమెట్ల బస్ డిపో సమీపంలో ప్రారంభ దశలోనే డ్రెయిన్ పనులు..

ప్రజావాణికి విశేష స్పందన



ఉపకమిషనర్ నరసింహకు వినతి పత్రం ఇస్తున్న లక్ష్మీనారాయణ

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల కార్యాలయాల్లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి విశేష స్పందన వచ్చింది. కుత్బుల్లాపూర్ సర్కిల్‌కు సంబంధించి టౌన్ ప్లానింగ్(6), ఇంజినీరింగ్ (04), హెల్త్ అండ్ శానిటేషన్ (2) మొత్తం 12 ఫిర్యాదులు రాగా, గాజులరామారం సర్కిల్‌లో టౌన్ ప్లానింగ్(7), ఇంజినీరింగ్ (3), ఎలక్ట్రికల్ (1) మొత్తం 11 ఫిర్యాదులు అందాయి. ఉప కమిషనర్లు నరసింహ, మల్లారెడ్డి స్వీకరించి పరిష్కరించాలని ఆయా విభాగాల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సుభాష్‌నగర్ డివిజన్ ఎస్‌ఆర్ నాయక్‌నగర్, రామిరెడ్డినగర్, మోడీ బిల్డర్స్, జనప్రియ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారుతోందని, సిబ్బంది సరిగా లేకపోవడంతో రోజువారీ చెత్తను తరలించడం లేదని బీఆర్‌ఎస్ నాయకుడు గుబ్బల లక్ష్మీనారాయణ ఉప కమిషనర్ నరసింహకు వినతి పత్రం అందజేశారు.

ప్రజావాణిలో ఆరు ఫిర్యాదులు

చింతల్: కుత్బుల్లాపూర్ వాటర్ బోర్డు కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో ఆరు ఫిర్యాదులు వచ్చాయి. సుచిత్ర సెక్షన్ పద్మానగర్ నుంచి మీటర్ మరమ్మతుల కోసం ఒకటి, గాజులరామారం నుంచి భూగర్భనేజీ పైప్ లైన్ కోసం ఫిర్యాదు ఒకటి, జగద్గిరిగుట్ట పొలాల బస్సు నుంచి నీటి ప్రెషర్ రావడం లేదని ఒక ఫిర్యాదు, చింతల్ సెక్షన్ నుంచి నూతన పైపులు వేయాలని రెండు ఫిర్యాదులు రాగా, పద్మానగర్‌లో పాత పైప్‌లైన్‌కు బదులుగా నూతన పైపులైనును మార్చాలని బిజెపి నేత నటరాజ్ గౌడ్ అధికారులకు వినతి పత్రం సమర్పించారు. ఈ ప్రజావాణిలో డీజీఎంలు రాజేష్, అప్పలనాయుడు, మేనేజర్లు అనూష, రమ్య భారతి, ఝాన్సీ, రవి, శివ ప్రసాద్, ఎలక్ట్రికల్ మేనేజర్ అమర్‌నాథ్ , రెవెన్యూ ఆఫీసర్ రామచందర్ తదితరులు ప్రజావాణిలో పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి పెద్దపీట



మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతరావును కలిసిన చైతన్యపున్నారెడ్డి తదితరులు..

సుభాష్‌నగర్: మహిళల అభ్యున్నతి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతరావు అన్నారు. సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బి.బ్లాక్ అధ్యక్షురాలు చైతన్యపున్నారెడ్డి ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సునీతరావుతో నియోజకవర్గంలో తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు ఆర్.లక్ష్మి, మహిళా కార్యదర్శి రమ్య, దుర్గ, యాస్మిన్, అమ్మాజీ, అర్చన తదితరులు ఉన్నారు.

19న మేడ్చల్ నుంచి అరుణాచలంకు ఆర్టీసీ బస్సు

మేడ్చల్: తమిళనాడు రాష్ట్రంలోని ప్రసిద్ధ శైవ క్షేత్రమైన అరుణాచలంకు మేడ్చల్ డిపో నుంచి ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించామని డీఎం సుధాకర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని కాణిపాకం, తమిళనాడులోని గోల్డెన్ టెంపుల్ మీదుగా అరుణాచలం వరకు ప్రత్యేక బస్సు నడిపిస్తున్నట్లు తెలిపారు. గిరి ప్రదక్షిణ చేసే భక్తుల కోసం ఈ నెల 19న సాయంత్రం 7 గంటలకు బస్సు బయలుదేరుతుందన్నారు. తిరుగు ప్రయాణంలో ఈ బస్సు ఈ నెల 21వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు అరుణాచలంలో బయలుదేరుతుందని డీఎం వివరించారు. టికెట్ ధర ఒక్కొక్కరికి రూ. 3900 ప్రకారం నిర్ణయించినట్లు తెలిపారు.



ఆర్‌కే లేఅవుట్‌లో అధ్వానంగా రోడ్డు

పనులపై పట్టింపేది..?



ఆదిత్య గార్డెన్‌లో రోడ్డు పరిస్థితి

నిజాంపేట్: అభివృద్ధి పనుల పేరిట రోడ్లను తవ్వి మళ్లీ వేయకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి ప్రగతినగర్ ఆర్‌కే లేఅవుట్, సాయినగర్, ఆదిత్య గార్డెన్ ప్రాంతాల్లో ఇటీవల నాలా పనుల కోసం రోడ్లను తవ్వి పైపులైన్ పనులు పూర్తిచేశారు. అయితే రోడ్ల పునర్నిర్మాణానికి టెండర్లు పిలవ లేదు. దీంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్డంతా బురదమయంగా రాకపోకలు సాగించేందుకు కూడా వీల్లేకుండాపోయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని ఆయా బస్తీల ప్రజలు కోరుతున్నారు.

తాగునీటి పైపులైన్ నిర్మించాలి

జగద్గిరిగుట్ట: డివిజన్ మగ్దూంనగర్ పొలాలబస్తీలో తాగునీటి పైపులైన్ వేయాలని కోరుతూ సీపీఐ నాయకులు సోమవారం ప్రజావాణిలో వాటర్ వర్క్స్ మేనేజర్ ఝాన్సీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని విధుల్లో పైప్‌లైన్ పనులు పూర్తి చేశారని, మరికొన్ని చోట్ల అలాగే వదిలేశారని, దీని వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేశ్, కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, కృష్ణ, నాయకులు ఇమామ్, ప్రభాకర్, శంకర్, అశోక్, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వారాహి పూజలు



పూజల్లో కార్పొరేటర్ జగన్

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని సీసాల బస్తీలోని వారాహి అమ్మవారికి ఆషాఢ మాస పూజలు సోమవారం ముగిశాయి. 9 రోజుల పాటు జరిగిన పూజల్లో రోజుకొక రూపంలో అమ్మవారిని అలంకరించి పూజించారు. అమ్మవారి దీక్షాపరులు, భక్తులు చివరి రోజు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక కార్పొరేటర్ జగన్ తన కుటుంబంతో కలిసి దర్శించుకున్నారు.

దేవాలయ భూములు కాపాడాలి

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట కొండపై ఉన్న శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ భూములు కాపాడాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్య గౌడ్ కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజా దర్బార్‌లో వినతి పత్రం అందజేశారు. భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ భూమిని రక్షించి జూనియర్, డిగ్రీ కాలేజీలు, విద్యుత్ ఉపకేంద్రానికి స్థలం కేటాయించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

విద్యార్థులు బాధ్యతాయుతంగా మెలగాలి

కూకట్‌పల్లి: విద్యార్థులు సమాజం పట్ల అవగాహన పెంచుకోవాలని డీసీఈబీ చైర్మన్ సురేష్ అన్నారు. సోమవారం కూకట్‌పల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పోస్టర్ తయారీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సామాజిక బాధ్యతను తెలియజేయాలనే ఉద్దేశంతో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జనాభా నియంత్రణ, మహిళా సాధికారత అనే అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఎంఈఓ రవీందర్‌బాబు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి వున్న నైపుణ్యాలను వెలికితీయాలని ఉపాధ్యాయులకు సూచించారు. జిల్లా స్థాయిలో జరిగిన పోటీల్లో వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. డ్రాయింగ్ టీచర్లు రవీంద్రరాజు, సహదేవ్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ పోటీల్లో కూకట్‌పల్లి జెడ్‌పీహెచ్‌యస్ విద్యార్థిని బిందుశ్రీ ప్రథమ బహుమతి సాధించింది. ప్రధానోపాధ్యాయులు నరేందర్‌రెడ్డి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో గాజులరామారం పాఠశాల..!



వర్షానికి తడిసిన బియ్యం



వర్షానికి తడిసిన పాఠశాల గోడలు

సుభాష్‌నగర్: గాజులరామారం గ్రామంలోని శిథిలావస్థకు చేరిన మండల ప్రాథమిక పాఠశాలలోని బియ్యం ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి తడిసిపోయాయి. ఇందులో 1–5వ తరగతి వరకు గాను 166 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. మొత్తం 6 గదులు ఉండగా, పాత భవనంలో నాలుగు గదులు పూర్తిగా ప్రమాదకరంగా మారాయి. కొన్నేళ్ల క్రితం 'భవనం కూలేందుకు సిద్ధంగా ఉందన్న విషయమై జూన్ 1న 'విద్యాశాఖ.. మొద్దునిద్ర' అనే కథనం సాక్షి ప్రచురించింది. దీంతో ఎంఈఓ వసంత కుమారి స్పందించి భవనాన్ని కూల్చివేస్తామని, నూతన భవనం కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపామని తెలిపారు. స్కూల్ ప్రధానోపాధ్యాయుడు సురేశ్ మాట్లాడుతూ ఆదివారం కురిసిన వర్షంతో జరిగిన నష్టం విషయమై డీఈవోకు లేఖ రాసినట్లు తెలిపారు.

చేనేత కార్మికుల సంక్షేమానికి బీజేపీ కృషి



పద్మశాలి కులసంఘం సన్మానసభలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

కుత్బుల్లాపూర్: చేనేత కార్మికుల సంక్షేమానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. సోమవారం గాజులరామంలో పద్మశాలి కుల బాంధవుల సన్మాన సభకు ఈటల రాజేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రజలకు దుస్తులు ఇచ్చే పద్మశాలి కులస్తులకు ఎంతో గౌరవం ఉందని, దేశవ్యాప్తంగా చేనేతకు మంచి ఆదరణ ఉన్నా పద్మశాలీల్లో ఇంకా కడు బీదరికంతో బాధపడుతున్నారని పేర్కొన్నారు. చేనేత కార్మికుల ఉపాధి కోసం ప్రభుత్వాలు పనిచేయవల్సిన అవసరం ఉందన్నారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని చిన్న, సన్నకారు పద్మశాలి సంఘాలకు బ్యాంకుల ద్వారా, వివిధ స్కీముల ద్వారా రుణాలు అందజేస్తామన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ఈ చేనేత కళను, కులవృత్తులను వదులుకొని పట్టణాలకు వలసలు వస్తున్నారని చేనేత కార్మికుడు 60 ఏళ్లకు రిటైర్డు కాదని, కాళ్లు, చేతులు, కళ్లు పనిచేసే వరకూ పని చేస్తూనే ఉంటాడన్నారు. ఉపాధి హామీ పనుల్లో నాలుగు గంటలు పనిచేస్తే రూ. 200 వస్తాయని, కానీ చేనేత కార్మికులు రోజంతా కష్టపడి మగ్గం నేసినా రూ.50 కూడా రావడం లేదన్నారు. కులవృత్తిని వదులుకోకుండా నిబద్ధతతో పనిచేస్తున్న పద్మశాలీలకు తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ సంఘం నాయకులు, కులస్తులు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దుండిగల్‌లో అమ్మమాట.. అంగన్‌వాడీ బాట



బహదూర్‌పల్లిలో ర్యాలీని ప్రారంభిసున్న కౌన్సిలర్ ఎల్లుగారి సత్యనారాయణ..



ర్యాలీలో పాల్గొన్న సూపర్‌వైజర్ తిరుమల, వైద్యులు డానియేల్, అంగన్‌వాడీ టీచర్లు

సుభాష్‌నగర్: దుండిగల్ మున్సిపల్ పరిధిలోని బహదూర్‌పల్లిలో సోమవారం అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే ర్యాలీ నిర్వహించి నూతన జాతీయ విద్యా విధానంపై తల్లిదండ్రులకు తెలియజేశారు. స్థానికంగా రెండున్నర సంవత్సరాలు నిండిన పిల్లల పిల్లను అంగన్‌వాడీల్లో నమోదు చేశారు. దుండిగల్ మున్సిపల్ బహదూర్‌పల్లి 2వ అంగన్‌వాడీ సెంటర్ లో టీచర్ నాగరాణి ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని కౌన్సిలర్ ఎల్. సత్యనారాయణ ప్రారంభించగా, బహదూర్ పల్లి అంగన్‌వాడీ–1లో టీచర్ ప్రేమలత వినూత్న పద్ధతిలో చదువు గొప్పతనంపై విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేశారు. దూలపల్లి అంగన్‌వాడీ 3లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్పందన, జిల్లా ఐఎన్టీయూసీ ప్రెసిడెంట్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రంగారెడ్డినగర్‌లో...

రంగారెడ్డినగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమ్మమాట.. అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా సోమవారం రంగారెడ్డినగర్ డివిజన్ నందానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో రెండున్నర సంవత్సరాలు నిండిన చిన్నారుల పేర్లను నమోదు చేశారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సెక్టార్ సూపర్‌వైజర్ తిరుమల ఆధ్వర్యంలో ప్రభుత్వ నూతన విద్యా విధానంపై వివరించారు. అదే విధంగా అంగన్‌వాడీల్లో అందజేసే పౌష్టికాహారం, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం చిన్నారులతో కలసి అమ్మమాట, అంగన్‌వాడీ బాట ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నందానగర్ బస్తీ దవాఖానా వైద్యుడు డానియేల్, బస్తీ ప్రెసిడెంట్ కార్తీక్‌గౌడ్, సబ్‌సెంటర్ వైద్యురాలు జ్యోతి, ఏఎస్‌ఎమ్ జగదీశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు లలిత, జ్ఞానేశ్వరి, ప్రభావతి, రాధ, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

3.5 కిలోల గంజాయి స్వాధీనం



నిందితుడు శుభకంత జన



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు, మొబైల్ ఫోన్

దుండిగల్: సెక్యూరిటీ గార్డు నుంచి 3.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్న ఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఒడిశా రాష్ట్రానికి చెందిన శుభకంతజన గాగిల్లాపూర్‌లో నివాసముంటూ ప్రీమియర్ ఇంజినీరింగ్ పరిశ్రమలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి ఎస్‌ఓటీ, దుండిగల్ పోలీసులు విశ్వసనీయ సమాచారం మేరకు శుభకంతజనను అదుపులోకి తీసుకుని విచారించగా అతని వద్ద 3.8 కిలోల గంజాయి లభ్యమైంది. ఒడిశాకు చెందిన మిత్రుడు జిల్లు నుంచి రూ.15వేలకు నాలుగు కిలోల గంజాయిని కొనుగోలు చేసినట్లు శుభకంత విచారణలో అంగీకరించాడు. గంజాయిని అమీత్ అనే వ్యక్తికి విక్రయించాలనుకున్న నేపథ్యంలో పోలీసులకు పట్టుబడ్డాడు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలి



కూకట్‌పల్లి: డ్రగ్స్ రహిత సమాజ స్థాపనలో విద్యార్థుల భాగస్వాములు కావాలని కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం అశోక గార్డెన్స్‌లో వివేకానంద డిగ్రీ కళాశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులు ఏసీపీ శ్రీనివాసరావు, కళాశాల చైర్మన్ డాక్టర్ కొరదాల నరేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ విద్యార్థులందరూ బాగా చదువుకోవాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి ప్రజలకు సేవ చేయాలని సూచించారు. విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, ఎవరైనా డ్రగ్స్ సేవించినట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రమాణం చేయించారు. కాలేజ్ చైర్మన్ డా. కొరదాల నరేష్ మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో విద్యార్థులు భాగస్వాములు కావాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్ ముత్తు, కాలేజ్ డైరెక్టర్ కేపీ లావణ్య, ఆర్గనైజ్ డీన్ మౌనిక, ప్రిన్సిపల్ బిఎస్ రాజేష్, వైస్ ప్రిన్సిపల్ భాగ్య, స్టూడెంట్స్ డీన్ రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.